సాక్షి శ్రీసత్యసాయి జిల్లా

ఆదివారం । 24 । సెప్టెంబర్ । 2023



చీనీ టన్ను రూ.20 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో శనివారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.20 వేలు పలికాయి.



'వందేభారత్' రాకకు ఏర్పాట్లు

నేటి నుంచి వందేభారత్ రైలు జిల్లాలో పరుగులు పెట్టనుంది. ప్రధాని మోదీ వర్చువల్‌గా ప్రారంభించనున్నారు. 8లో

గరిష్టం/కనిష్టం 36.8°/22.1°

జిల్లాలో శనివారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడ తేలికపాటి జల్లులు పడ్డాయి.

న్యూస్‌రీల్

గణేష్ నిమజ్జనానికి పటిష్ట బందోబస్తు



హిందూపురం అర్బన్: హిందూపురంలో ఆదివారం వినాయక విగ్రహాల నిమజ్జనం సందర్భంగా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు డీఎస్పీ కంజాక్షన్ తెలిపారు. ఆరుగురు డీఎస్పీలు, 20 మంది సీఐలు, 35 మంది ఎస్‌ఐలు, 35 మంది హెడ్ కానిస్టేబుళ్లు, మొత్తం 500 మంది పోలీసులు విధుల్లో ఉంటారని పేర్కొన్నారు. ప్రజలు, ఉత్సవ కమిటీ సభ్యులు సహకరించాలని సూచించారు. మద్యం దుకాణాలు మూసివేయిస్తున్నామని, రాత్రిలోపు నిమజ్జనం పూర్తి చేసేలా చర్యలు తీసుకొంటున్నట్లు వివరించారు. నిమజ్జనోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలోకి భారీ వాహనాలు అనుమతించడం లేదని స్పష్టం చేశారు. పరిగి వైపు నుంచి వచ్చే వాహనాలు శిరమీదుగా వెళ్లాలని సూచించారు. అలాగే, కొట్నూరు నుంచి వచ్చే వాహనాలు పాలసముద్రం వైపు, లేపాక్షి వైపు నుంచి వచ్చే వాహనాలు జాతీయ రహదారి మీదుగా ప్రయాణించాలని సూచించారు.హిందూపురంలో లోడింగ్, అన్‌లోడింగ్ ఉంటే సోమవారం ఉదయం అనుమతిస్తామనిని, వ్యాపారులు సహకరించాలన్నారు. కాగా, శనివారం సీఐలు వి.శ్రీనివాసులు, వై. శ్రీనివాసులు, వేణుగోపాల్‌లు పట్టణంలో కలయతిరిగి గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులకు నిబంధనలు తెలియజేశారు.

ఇంటర్ ఫెయిలైనా తరగతులకు రండి



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న డీవీఈఓ రఘునాథ రెడ్డి, ప్రిన్సిపాళ్లు

పెనుకొండ: ఇంటర్‌లో ఫెయిలైనా కళాశాలల్లో తరగతులకు హాజరుకావాలని డీవీఈఓ రఘునాథరెడ్డి విద్యార్థులకు సూచించారు. ఇందుకు సంబంధించిన పోస్టర్లను పట్టణంలో శనివారం ఆయన పలువురు ప్రిన్సిపాళ్లతో కలసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డీవీఈఓ మాట్లాడుతూ ఫీజు చెల్లించి ఫెయిల్ లేకుండా పరీక్ష రాయడానికి అక్టోబర్ 3 వరకూ గడువు విధించినట్లు తెలిపారు. రెగ్యులర్ విద్యార్థులుగా తరగతులకు వెళ్లవచ్చన్నారు. ప్రైవేటు, మేనేజ్‌మెంట్ కళాశాలల విద్యార్థులకు సైతం వర్తిస్తుందని, అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.

దంచికొట్టిన వాన



బత్తలపల్లి చెరువు కాలువలో పారుతున్న నీరు



కళకళలాడుతున్న చిత్రావతి నది



బీడుపల్లి వంకలో జల ప్రవాహం

- పొంగిన వాగులు.వంకలు
- చిత్రావతికి జలకళ
- తడిసిముద్దైన 'గోరంట్ల'

పుట్టపర్తి అర్బన్: ఈ ఏడాదిలోనే అత్యధిక వర్షం కురిసింది. రైతన్న మోములో ఆనందం నింపింది. శుక్రవారం అర్ధరాత్రి 12.30 నుంచి శనివారం ఉదయం 6 గంటల వరకూ ఏకధాటిగా వాన కురుస్తూనే ఉంది. దీంతో జిల్లాలోని పలు మండలాల్లో భారీ వర్షపాతం నమోదైంది. సుమారు 5 గంటలు కురిసిన వర్షంతో చిత్రావతి నది జలకళ సంతరించుకుంది. పలు ప్రాంతాల్లో వాగులు, వంకలు పొంగాయి. చెక్‌డ్యాంలు, కుంటలు నిండాయి. సాగులో ఉన్న పంటలకు వర్షం చాలా ఉపయోగకరమని పలువురు రైతులు తెలిపారు.

గోరంట్లలో అత్యధికం..

జిల్లాలోని 22 మండలాల్లో వర్షం కురిసింది. గోరంట్ల మండలంలో అత్యధికంగా 145.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. అలాగే, బుక్కపట్నం మండలంలో 124.4 మి.మీ, ముదిగుబ్బ మండలంలో 102.6 మిల్లీమీటర్ల వర్షం పడింది. ఇక.. సోమందేపల్లిలో 95.8, పుట్టపర్తి- 94.6, కొత్తచెరువు- 90.8, నల్లమాడ- 55.8, తాడిమర్రి- 39.2, తలుపుల-35.4, చిలమత్తూరు-33.8, అమడగూరు -25.8, పెనుకొండ- 25.2, కదిరి- 21, సీకేపల్లి- 10.4, ఓడీచెరువు- 9.4, రొద్దం-9, బత్తలపల్లి, రామగిరి మండలాల్లో 6.4, కనగానపల్లి, ధర్మవరం, నల్లచెరువు- 5.4, తనకల్లు-2.4 మి.మీ వర్షపాతం నమోదైంది.



గువ్వలగుట్టపల్లి చెరువు సప్లై చానల్‌లో..

అనుమతి లేకుండా ఆక్రమణ

- పుట్టపర్తి ఆర్టీసీ బస్టాండ్‌లో దుకాణదారుల ఇష్టారాజ్యం
- యథేచ్ఛగా కుర్చీలు, టేబుళ్ల ఏర్పాటు
- ఇరుకు కావడంతో బస్సుల రాకపోకలకు ఇబ్బందులు
- చర్యలు తీసుకోవడంలో అధికారుల నిర్లక్ష్యం
- ప్రయాణికుల ప్రాణాలు తీస్తున్న వైనం



పుట్టపర్తి ఆర్టీసీ బస్టాండ్ పరిసరాల్లోని దుకాణాల ముందు ఎలా పడితే అలా ఏర్పాటు చేసిన కుర్చీలు, టేబుళ్లు (ఇన్‌సెట్) బస్సు ఢీకొని మృత్యువాత పడ్డ నరసింహులు (ఫైల్)

పుట్టపర్తి టౌన్: ఎవరికేమైతే మాకేంటి.. మా వ్యాపారాలు బాగా జరిగితే చాలు అన్నట్లుగా ఉంది పుట్టపర్తి ఆర్టీసీ బస్టాండ్‌లో దుకాణదారుల తీరు. ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ అమాయక ప్రయాణికుల ప్రాణాల మీదికి తెస్తున్నారు. తగిన చర్యలు తీసుకోవడంలో అధికారులు తాత్సారం ప్రదర్శిస్తున్నారు. దీంతో బస్టాండ్ స్థలం రోజురోజుకు కుంచించుకుపోతోంది. ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. బస్సులు మళ్లిస్తున్న సమయంలో డ్రైవర్లకు అవస్థలు తప్పడం లేదు. పరిసరాలు ఇరుకుగా మారడంతో ఒక్కోసారి బస్సులు అదుపు తప్పుతున్నాయి. అమాయకుల ప్రాణాలు బలిగోరుతున్నాయి. బస్సులు ఢీకొని ఇప్పటికే పలువురు ప్రయాణికులు మృత్యువాత పడ్డారు. కొందరు గాయపడ్డారు.

పెరిగిన బస్సులు.. ప్రజల రాకపోకలు

సత్యసాయి బాబా ఉన్న కాలంలో ప్రయాణికుల సౌకర్యార్థం పుట్టపర్తి నడిబొడ్డున రెండు ఎకరాల స్థలంలో 1990 అక్టోబర్ 17న బస్టాండ్ ప్రారంభించారు. అన్ని సౌకర్యాలు కల్పించి నూతన హంగులతో తీర్చిదిద్దారు. ఒకప్పటితో పోల్చితే పట్టణానికొచ్చే బస్సుల సంఖ్య పెరిగింది. ప్రస్తుతం బస్టాండ్‌కు నిత్యం 70 దాకా రాకపోకలు సాగిస్తున్నాయి. వేలాది మంది ప్రయాణికులు వచ్చిపోతున్నారు. పుట్టపర్తిని జిల్లాకేంద్రం చేశాక ప్రజల రాకపోకలు భారీగా పెరిగాయి.

అనుమతి మూరెడు.. ఆక్రమణ బారెడు..

ఆర్టీసీ సంస్థకు ఆదాయం పెంపులో భాగంగా బస్టాండ్‌లో 9 దుకాణాలతో పాటు పార్కింగ్ స్థలం ఏర్పాటు చేసి వాటికి టెండర్లు ఖరారు చేసి అనుమతులు మంజూరు చేశారు. దుకాణాల నుంచి నెలకు రూ. 1.20 లక్షల ఆదాయం సమకూరుతోంది. అయితే ప్రతి దుకాణాదారుడు తమ దుకాణం ముందు ఇష్టారాజ్యంగా కుర్చీలు, టేబుళ్లు ఏర్పాటు చేసుకున్నారు. అనుమతులకు మించి స్థలం ఆక్రమించుకున్నారు. పార్కింగ్ స్థలం లీజుదారుడు కొంత వరకూ స్థలం వెనకేసుకున్నారు. దీంతో బస్టాండ్ లోపలకు వస్తున్న సమయంలో బస్సుల డ్రైవర్లు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

- బెంగళూరులోని తన కుమార్తె దగ్గరకు వెళ్లేందుకు బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన చిన్న నరసింహప్ప (75) ఇటీవల పుట్టపర్తి ఆర్టీసీ బస్టాండ్‌కు వచ్చారు. అక్కడే బస్టాండ్ పరిసరాల్లోని ఓ దుకాణంలో టీ తాగి, బిస్కెట్ ప్యాకెట్ తీసుకుని మళ్లీ ప్లాట్‌ఫాం వద్దకు వస్తున్నాడు. ఈ క్రమంలోనే పుట్టపర్తి నుంచి హిందూపురం వెళ్తున్న ఓ బస్సు ఆయనను ఢీకొంది. స్థానికులు వెంటనే స్థానిక సత్యసాయి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి తరలించగా.. పరీక్షించిన వైద్యులు మృతి చెందినట్లు ధ్రువీకరించారు.
- పుట్టపర్తిలోని 5వ వార్డు కుమ్మరపేటకు చెందిన నారాయణమ్మ (65) ఫిబ్రవరిలో ఆర్టీసీ బస్టాండ్‌లో బస్సు ఢీ కొనడంతో అక్కడికక్కడే మృతి చెందింది. పెనుకొండలో ఉన్న కుమార్తెను చూసి తిరిగి స్వస్థలానికి వెళ్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. విషయం తెలుసుకున్న కుటుంబీకులు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని కన్నీరుమున్నీరయ్యారు.

చర్యలు తీసుకుంటాం



సంస్థ ఆదాయం పెంపు కోసం కొన్ని దుకాణాలు అద్దెకు ఇచ్చాం. దుకాణదారులు కేటాయించిన స్థలంలోనే ఉండేలా చర్యలు తీసుకుంటాం. వాటి ముందు అనుమతి లేకుండా వేసిన షెడ్లను కూడా గతంలో తొలగించాం. ఇక.. రోజూ సెక్యూరిటీని ఏర్పాటు చేసి ప్రయాణికులపై భద్రతపై దృష్టి సారిస్తాం. ప్రమాదాలు జరగకుండా చూస్తాం.

– మధుసూదన్, డీపీటీఓ

హెచ్‌ఆర్‌ఏ మంజూరుపై హర్షం



గెజిట్ కాపీని కలెక్టరేట్ ఏఓకు అందజేస్తున్న ఉద్యోగులు

పుట్టపర్తి అర్బన్: జిల్లా కేంద్రంలో పని చేస్తున్న ఉద్యోగులకు 16 శాతం హెచ్‌ఆర్‌ఏ వర్తింపజేస్తూ గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేయడంతో ఉద్యోగులు హర్షం వ్యక్తం చేశారు. శనివారం ఏపీ నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్, ఏపీఎస్ ఆర్టీసీ, ఎన్ఎంయూ తదితర సంఘాలకు చెందిన ఉద్యోగులు కలెక్టరేట్‌లో ఏఓ వెంకటనారాయణకు గెజిట్ కాపీని అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా కేంద్రానికి 8 కిలోమీటర్ల పరిధిలో పని చేస్తున్న ఉద్యోగులందరికీ అడిగిన వెంటనే హెచ్‌ఆర్‌ఏ వర్తింపునకు కలెక్టర్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్, ఆర్అండ్‌బీ అధికారులు చర్యలు తీసుకోవడం సంతోషకరమని పేర్కొన్నారు.

హౌసింగ్ అధికారులపై విచారణకు ఆదేశం

అనంతపురం టౌన్: ఉచిత ఇసుక కూపన్లను ఇతరులకు అమ్ముకున్నట్లు ఇద్దరు హౌసింగ్ అధికారులపై ఫిర్యాదులు రావడంతో విచారణకు ఆదేశించినట్లు హౌసింగ్ ప్రాజెక్టు డైరెక్టర్ నరసింహారెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆయన శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. బెళుగుప్ప మండలానికి సంబంధించి హోలోగ్రామ్‌తో కూడిన ఇసుక కూపన్లను గుండ్లపల్లి సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్ గోవర్ధన్ తోపాటు శశికాంత్ అనే వర్క్ ఇన్‌స్పెక్టర్ కలిసి శ్రీసత్యసాయి జిల్లా చిలమత్తూరు మండలంలో అమ్ముకున్నట్లు తమకు ఫిర్యాదులు అందాయని పేర్కొన్నారు. జగనన్న ఇళ్ల నిర్మాణాల కోసం కేటాయించిన ఉచిత ఇసుక కూపన్లను పక్కదారి పట్టిస్తే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని పీడీ హెచ్చరించారు.

25 నుంచి బీఈడీ రెగ్యులర్ పరీక్షలు

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం పరిధిలో రెగ్యులర్ బీఈడీ, బీపీఈడీ రెగ్యులర్ మొదటి, నాలుగో సెమిస్టర్ పరీక్షలు ఈ నెల 25 నుంచి నిర్వహిస్తున్నట్లు డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్స్ ప్రొఫెసర్ జీవీ రమణ తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని కళ్యాణదుర్గం, అనంతపురం, హిందూపురం, కదిరి, తాడిపత్రి, గుంతకల్లు, ఎస్కేయూ బీఈడీ కళాశాలలో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. మొదటి సెమిస్టర్ పరీక్షలు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు, నాలుగో సెమిస్టర్ మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరుగుతాయని పేర్కొన్నారు.

ప్రభుత్వ సంకల్పంలో భాగస్వాములు కండి



వైద్యుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అరుణ్‌బాబు

- ఐఎంఏ స్పెషలిస్ట్ డాక్టర్లకు కలెక్టర్ అరుణ్‌బాబు పిలుపు

పుట్టపర్తి అర్బన్: ప్రజారోగ్య సంరక్షణే ధ్యేయంగా గొప్ప సంకల్పంతో ప్రభుత్వం నిర్వహిస్తున్న 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమంలో భాగస్వాములు కావాలని కలెక్టర్ అరుణ్‌బాబు పిలుపునిచ్చారు. శనివారం స్థానిక కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో 'ఐఎంఏ' స్పెషలిస్ట్ డాక్టర్ల బృందంతో ఆయన ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా 'జగనన్న ఆరోగ్య సురక్ష' నిర్వహిస్తోందన్నారు. డాక్టర్లు స్వచ్ఛందంగా భాగస్వాములు కావాలని కోరారు. జిల్లా యంత్రాంగానికి తోడ్పాటునందించాలన్నారు. కార్యక్రమ విధి విధానాలను తెలియజేశారు. వలంటీర్లు, సచివాలయ సిబ్బంది, వైద్య ఆరోగ్య సిబ్బంది ఇంటింటికీ తిరిగి ఆరోగ్య సమాచారం నమోదు చేస్తున్నారన్నారు. ఇప్పటి వరకూ 1.18 లక్షల మందిలో ఆరోగ్య సమస్యలు గుర్తించామన్నారు. త్వరలో శిబిరాలు నిర్వహిస్తామన్నారు. బీపీ, షుగర్, రక్త పరీక్షలు, ఈసీజీతో పాటు అన్ని పరీక్షలు చేయనున్నట్లు పేర్కొన్నారు. సుమారు 105 రకాల మందులు ఉచితంగా అందజేయనున్నట్లు చెప్పారు. అవసరమైతే ఆరోగ్యశ్రీ రెఫరల్ ఆసుపత్రులకు పంపి వైద్య సేవలు అందించనున్నట్లు తెలిపారు. శిబిరాల్లో పాల్గొని రోగులకు సేవలందించాలని కోరారు. మంచి అవకాశంగా భావించి సామాజిక బాధ్యతతో పాలుపంచుకోవాలని పిలుపునిచ్చారు. పలువురు వైద్యులు మాట్లాడుతూ 'జగనన్న ఆరోగ్య సురక్ష'ను విజయవంతం చేయడానికి తమ వంతు కృషి చేస్తామని తెలిపారు. సమావేశంలో డీఎంహెచ్ఓ ఎస్వీ కృష్ణారెడ్డి, డీసీహెచ్ఎస్ తిప్పేంద్రనాయక్, ప్రోగ్రాం ఆర్‌బీఎస్‌కే ఆఫీసర్ చెన్నారెడ్డి, డిప్యూటీ డీఎంహెచ్ఓ శ్రీదేవి, బత్తలపల్లి ఆర్డీటీ హాస్పిటల్ మేనేజర్ పవన్‌కుమార్, సత్యసాయి హాస్పిటల్ ప్రతినిధి భరత్, ఐఎంఏ ప్రతినిధులు ఎస్‌వీకే ప్రసాద్, నరసింహారెడ్డి, సుప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

పొసగని పొత్తు

- టీడీపీ, జనసేన నాయకుల మధ్య తీవ్ర విభేదాలు
- నాయకులు నిర్ణయాలు తీసుకున్నా కలిసి పనిచేయలేమని స్పష్టీకరణ
- తాము లేకపోతే జనసేనకు సీట్లు.. ఓట్లు లేవంటున్న టీడీపీ నాయకులు



సాక్షి ప్రతినిధి, అనంతపురం: రాజమండ్రి సెంట్రల్ జైలు దగ్గర పవన్‌కళ్యాణ్ టీడీపీ – జనసేన పొత్తు ఉంటుందని ప్రకటన చేసి వారం కాకముందే ఇరు పార్టీల నాయకుల మధ్య పొత్తు పొసగడం లేదు. అప్పుడే క్షేత్రస్థాయిలో తీవ్ర విభేదాలు పొడచూపుతున్నాయి. స్కిల్ స్కాంలో చంద్రబాబు అరెస్టుకు నిరసనగా చేపట్టిన రిలేదీక్షలు, ర్యాలీలకు తెలుగుదేశం పార్టీ నుంచే స్పందన కరువైంది. ఒకటీ రెండు చోట్ల జనసేన కార్యకర్తలు నిరసనకు వచ్చినా తెలుగుదేశం కార్యకర్తలతో ఇమడలేకపోతున్నారు. నాయకులు ములాఖత్‌లూ.. మిలాఖత్‌లూ అయితే మాత్రం తాము వారికి ఓటేయాలా.. అంటూ బాహాటంగానే విమర్శిస్తున్నారు. తెలుగుదేశం పార్టీ అంటేనే అవకాశవాద రాజకీయాలకు పెట్టింది పేరని జనసేన కార్యకర్తలు విమర్శిస్తున్నారు.

ఆయన పల్లకికి బోయీలు కాలేం

తెలుగుదేశం పార్టీ వేసే మెతుకుల కోసం తాము రావాలా.. వాళ్లు చెప్పినట్టు నడుచుకోవాలా.. ఆయన సీఎం కావడానికి పల్లకీ మోయడానికి మేము బోయీలుగా ఉండాలా? అన్న విమర్శలు వినిపిస్తున్నాయి. అసలే తెలుగుదేశం పార్టీ అంతిమ దశలో ఉందని, దీనికి తాము ఇప్పుడు ఊపిరి పోయాలా అంటూ కిందిస్థాయి కార్యకర్తలు మాట్లాడుతున్నారు. పైగా చంద్రబాబు వివిధ స్కాముల్లో ఇరుక్కున్నాక టీడీపీ పీకల్లోతు కష్టాల్లో కూరుకుపోయి ఉందని, ఈ సమయంలో ఆ పార్టీతో నడవాలని చెప్పడం సరి కాదని పవన్ కళ్యాణ్‌పైనే కార్యకర్తలు గుర్రుగా ఉన్నారు.

అభిమాన సంఘాలుగా కలిసేదే లేదు

అనంతపురం జిల్లాలో సినిమా నటులకు ఎప్పటినుంచో అభిమాన సంఘాలున్నాయి. ఇందులో ప్రధానంగా చిరంజీవి, పవన్‌కళ్యాణ్ అభిమాన సంఘాలతో పాటు మహేష్‌బాబు, బాలకృష్ణ అభిమాన సంఘాలు ఉన్నాయి. చిరంజీవి, పవన్‌కళ్యాణ్ అభిమాన సంఘాల్లోని యువకులు పలువురు తెలుగుదేశం పార్టీకి మద్దతు ఇవ్వలేమని, అవసరమైతే ఎన్నికలకు దూరంగా ఉంటాం గానీ, టీడీపీకి ఓటు వేయలేమని తెగేసి చెబుతున్నారు. 'పైస్థాయిలో నాయకులు సవాలక్ష మాట్లాడుకుంటారు.. క్షేత్రస్థాయిలో పరిస్థితులు వాళ్లకేం తెలుసు? జెండాలు మోసే మాకే తెలుస్తుంది' అంటూ పేర్కొంటున్నారు.మరీ ముఖ్యంగా బాలకృష్ణ అభిమాన సంఘం అంటే వీళ్లకు అస్సలు పడదు.

పొత్తును జీర్ణించుకోని సామాజికవర్గాలు..

జిల్లాస్థాయిలో నాయకులను సంప్రదించకుండా, పార్టీలో ఎవరితోనూ చర్చించకుండా జైల్లో ములాఖత్‌కు వెళ్లి బయటికొచ్చి టీడీపీ-జనసేన పొత్తు ప్రకటించడాన్ని పవన్‌కళ్యాణ్‌కు మద్దతుగా ఉండే కొన్ని సామాజిక వర్గాలు జీర్ణించుకోలేకపోతున్నాయి. నాలుగు రోజులుగా ఉమ్మడి అనంతపురం జిల్లాలోని పలు నియోజకవర్గాల్లో ఆయా సామాజిక వర్గాల వారీగా సమావేశాలు నిర్వహించుకుని తెలుగుదేశం పార్టీతో కలిసేది లేదని నిర్ణయించినట్లు తెలిసింది. అనంతపురం, కళ్యాణ దుర్గం, ధర్మవరం, రాప్తాడు, గుంతకల్లు లాంటి కొన్ని నియోజకవర్గాల్లో తెలుగుదేశం పార్టీతో పొత్తుపై తీవ్రంగా మండిపడుతున్నారు. తెలుగుదేశం, జనసేన ద్వితీయ శ్రేణి నాయకుల్లో అయితే పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటోంది. అవసరానికి వాడుకుని వదిలేసే రకం మీరు అని జనసేన నాయకులు అంటుండగా... మేము లేకపోతే మీకు ఓట్లు, సీట్లు ఎక్కడున్నాయి అంటూ తెలుగుదేశం నాయకులు వెటకారంగా మాట్లాడుతున్నారు. దీంతో అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లో జనసేన-తెలుగుదేశం పార్టీల మధ్య పొత్తు ఏ మాత్రమూ పొసగదు అని అంటున్నారు. ఇదిలా ఉండగా హైకోర్టులో శుక్రవారం చంద్రబాబు తరఫున వేసిన క్వాష్ పిటిషన్ కొట్టేయడంతో తెలుగుదేశం పార్టీలో మరింత నైరాశ్యం ఏర్పడింది.

క్లుప్తంగా

మిద్దె కూలి ఆరుగురికి గాయాలు



వర్షానికి కూలిన మిద్దె పైకప్పు

పెనుకొండ రూరల్: భారీ వర్షానికి పురాతన మిద్దె కూలడంతో ఆరుగురు గాయపడ్డారు. స్థానికులు తెలిపిన మేరకు... పెనుకొండ మండలం నాగలూరుకు చెందిన జయమ్మ, తన పిల్లలు జయశ్రీ, హేమలతతో కలసి ఇటీవల తన పుట్టినిల్లైన మావటూరుకు వెళ్లారు. శుక్రవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి జయమ్మ తల్లి చంద్రమ్మ నివాసముంటున్న మిద్దె ఒక్కసారిగా కుప్పకూలింది. శిథిలాల కింద చిక్కుకున్న చంద్రమ్మతో పాటు ముత్యాలమ్మ (బంధువు), జయమ్మ, జయశ్రీ, హేమలతని స్థానికులు కాపాడి వెంటనే హిందూపురంలోని జిల్లాస్పత్రికి తీసుకెళ్లారు. వీరిలో హేమలత, జయశ్రీ పరిస్థితి విషమంగా ఉండడంతో బెంగళూరుకు తరలించారు.

పాలబావిలో పడి మహిళ మృతి



మృతురాలు అశ్వత్థమ్మ

రొళ్ల: ప్రమాదవశాత్తు బావిలో పడి ఓ మహిళ మృతి చెందింది. పోలీసులు తెలిపిన మేరకు... కర్ణాటకలోని మధుగిరి తాలూకా మిడిగేశి హోబళి బ్రహ్మదేవరహళ్లికి చెందిన అశ్వత్థమ్మ (45)కు కొన్నేళ్ల క్రితం మడకశిర మండలం వైబీ హళ్లికి చెందిన కురుబ చిక్కన్నతో వివాహమైంది. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. కొన్ని రోజుల క్రితం వీరి కాపురం సజావుగా సాగింది. ఆ తర్వాత అశ్వత్థమ్మ మతిస్థిమితం కోల్పోయి కుటుంబానికి దూరంగా ఆలయాలు, వివిధ ప్రాంతాల్లో తిరుగుతూ వస్తోంది. ఈ క్రమంలో ఏడు రోజుల క్రితం రత్నగిరి గ్రామానికి వచ్చిన ఆమె కొల్హాపురి మహాలక్ష్మీదేవి ఆలయ పరిసరాల్లో సంచరిస్తుండేది. శనివారం మధ్యాహ్నం 3 గంటలకు పాలబావి వద్దకు వెళ్లిన ఆమె ప్రమాదవశాత్తు అందులో పడి మృతిచెందింది. విషయాన్ని గుర్తించిన స్థానికుల సమాచారం మేరకు పోలీసులు అక్కడకు చేరుకుని మృతదేహాన్ని వెలికి తీశారు. వీఆర్వో ప్రకాష్‌రావు సమక్షంలో పంచనామా నిర్వహించి, మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మొత్తం ఓటర్లు 13,62,825!

- ముసాయిదా ఓటరు జాబితా సిద్ధం
- ఎన్నికల కమిషన్‌కు పంపిన అధికారులు
- అక్టోబర్ 17న ప్రదర్శన

పుట్టపర్తి అర్బన్: 2019 ఎన్నికల కోసం అప్పటి టీడీపీ ప్రభుత్వం ఇష్టారాజ్యంగా దొంగ ఓట్లు ఎక్కించింది. అధికారం కోసం అడ్డదారులు తొక్కింది. ఒక్క టీడీపీ కార్యకర్తకే రెండు, మూడేసి ఓట్లు, ఎక్కడో ఉన్న వారికీ, చివరికి చనిపోయిన వారిని కూడా అప్పట్లో ఓటరు జాబితాలో చేర్చారు. అయినా, పరాభవం మాత్రం తప్పించుకోలేకపోయారు. అయితే, ఈసారి జరిగే సార్వత్రిక ఎన్నికల్లో దొంగ ఓట్ల తప్పులు జరగకుండా పక్కాగా ఓటరు జాబితా రూపొందించడమే లక్ష్యంగా ఎన్నికల సంఘం చర్యలు తీసుకుంది. ఇందుకోసం నెల పాటు ఇంటింటి సర్వే నిర్వహించారు. బీఎల్‌ఓలు, బీఎల్‌ఏలు కలిసి ప్రతి ఇంటికీ వెళ్లి వివరాలు సేకరించారు. ఓటర్ల చిరునామా, ఫొటో సేకరణ, పేర్లు, ఇంటి నంబర్లు సరి చూసి కచ్చితమైన వివరాలు నమోదు చేశారు. తొలగింపులు, మృతులు, శాశ్వతంగా వలస వెళ్లినవారు, చిరునామా మార్పులు వంటివి పునఃపరిశీలన చేశారు. కలెక్టర్ అరుణ్‌బాబు, జేసీ చేతన్, ఈఆర్‌ఓలు స్వయంగా పరిశీలించారు. జిల్లాలో అర్హులైన ఏ ఒక్కరి ఓటూ తొలగించకుండా పగడ్బందీగా వ్యవహరించారు. ఆ మేరకు ముసాయిదా ఓటరు జాబితా రూపొందించారు.



బుక్కపట్నంలో ఓటు పరిశీలన చేస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు

అభ్యంతరాలు పరిశీలించాక తుది జాబితా..

ముసాయిదా జాబితా ప్రకారం జిల్లాలో 13,62,825 మంది ఓటర్లు ఉన్నట్లు తేలింది. పురుషులు 6,83,298 మంది, మహిళలు 6,79,467, ఇతరులు 60 మంది ఉన్నారు. పుట్టపర్తి, ధర్మవరం, కదిరి నియోజక వర్గాల్లో మహిళల ఓట్లు ఎక్కువగా ఉన్నాయి. పుట్టపర్తి నియోజకవర్గంలో 742, ధర్మవరం నియోజక వర్గంలో 956 మంది, కదిరి నియోజకవర్గంలో 1,643 మంది మహిళా ఓటర్లు అధికంగా ఉన్నారు. ఆ మేరకు రూపొందించిన ముసాయిదా ఓటరు జాబితాను ఎన్నికల కమిషన్‌కు అధికారులు పంపారు. కమిషన్ ఆదేశాల ప్రకారం అక్టోబర్ 17న ముసాయిదా ఎన్నికల జాబితా ప్రదర్శిస్తారు. ఆ రోజు నుంచి నవంబర్ 30 వరకూ అభ్యంతరాలు స్వీకరిస్తారు. ఇందుకోసం ప్రత్యేక క్యాంపులు ఏర్పాటు చేయనున్నారు.

జిల్లాలో మొత్తం ఓటర్లు	13,62,825 మంది
పురుష ఓటర్లు	6,83,298 మంది
మహిళా ఓటర్లు	6,79,467 మంది
ఇతర ఓటర్లు	60 మంది
నూతన ఓటరు దరఖాస్తులు	45,463
మృతులు, అడ్రస్ మార్పు దరఖాస్తులు	31,244
పేర్లు, అడ్రస్, ఫొటో మార్పు దరఖాస్తులు	41,363

1,561 పోలింగ్ కేంద్రాలు..

ఓటరు జాబితాకు అనుగుణంగా పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్ ప్రక్రియ కూడా పూర్తి చేశారు. ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు 1500 ఓట్లు కన్నా అధికంగా ఉన్నా, రెండు కిలోమీటర్ల కంటే ఎక్కువ దూరం ఉన్న కేంద్రం ఏర్పాటు చేసే భవనం శిథిలావస్థకు చేరుకున్నా కేంద్రాన్ని మారుస్తున్నట్లు అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులకు తెలియజేశారు. వారి వినతులు సైతం పరిగణనలోకి తీసుకున్నారు. ఈ క్రమంలోనే జిల్లాలో 6 కేంద్రాలు పెరిగాయి. పుట్టపర్తి నియోజకవర్గంలో 237, మడకశిరలో 236, ధర్మవరం 287, కదిరి 281, హిందూపురం 253, పెనుకొండ 261 పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్‌కు ముందు 1,555 పోలింగ్ కేంద్రాలు ఉండగా తాజాగా 6 పెరిగాయి.

జనవరి 5న తుది జాబితా

అక్టోబర్ 17న ముసాయిదా ఓటరు జాబితాను ప్రదర్శిస్తాం. అభ్యంతరాలను స్వీకరించిన అనంతరం తుది జాబితా రూపొందిస్తాం. 2024 జనవరి 5న తప్పులు లేని కచ్చితమైన ఓటరు జాబితా ప్రచురిస్తాం. అర్హత ఉన్న ఏ ఒక్క ఓటూ పోకుండా ఉండాలనే ఉద్దేశంతో పటిష్ట చర్యలు తీసుకున్నాం.

– అరుణ్‌బాబు, కలెక్టర్

న్యాయ సేవలు సద్వినియోగం చేసుకోండి

అనంతపురం: న్యాయసేవాధికార సంస్థ ద్వారా ఉచిత న్యాయ సేవలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.శ్రీనివాస్ సూచించారు. న్యాయ సేవాధికార చట్టం కింద ప్రజా ప్రయోజన సేవల్లో శాశ్వత లోక్ అదాలత్ తప్పనిసరిగా పరిష్కారం అందిస్తుందన్నారు. న్యాయ సేవా సదన్‌లో శనివారం ప్రజా ప్రయోజన సేవ శాఖల ప్రభుత్వ అధికారులకు శాశ్వత లోక్ అదాలత్‌లో ప్రజా ప్రయోజన కేసుల పరిష్కారంపై అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల ప్రజా ప్రయోజన సేవల శాశ్వత లోక్ అదాలత్ ధర్మాసనం చైర్మన్ జి.శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథి జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రజా ప్రయోజన సేవల శాశ్వత లోక్ అదాలత్ అటు రాజీమార్గంలో పరిష్కారానికి కృషి చేస్తుందన్నారు. రాజీ కాని పక్షంలో తీర్పు వెలువరించగల అధికారమూ కలిగి ఉంటుందన్నారు. శాశ్వత లోక్ అదాలత్ గురించి చైర్మన్ జి.శ్రీనివాసరావు వివరించారు. రాజీ కుదరని పక్షంలో ధర్మాసనం తీర్పు వెలువరిస్తుందని, ఇది అప్పీలు లేని శాశ్వత లోక్ అదాలత్ తీర్పు అవుతుందని స్పష్టం చేశారు. శాశ్వత లోక్ అదాలత్ సభ్యులు ఎం.రాజశేఖర్‌రెడ్డి, ప్రసంగించారు.



సదస్సులో ప్రసంగిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.శ్రీనివాస్

ఆదరణ బాధితులతో కిక్కిరిసిన డీపీఓ



అనంతపురం జిల్లా ఎస్పీ అన్బురాజన్‌ను కలిసేందుకు వచ్చిన బాధితులు

అనంతపురం క్రైం: ఆదరణ చిట్‌ఫండ్స్ బాధితులతో అనంతపురం జిల్లా పోలీసు కార్యాలయ ఆవరణం శనివారం కిటకిటలాడింది. దాదాపు వందకు పైగా బాధితులు ఎస్పీ అన్బురాజన్‌ను కలసి తమకు న్యాయం చేయాలంటూ వినతి పత్రాలు అందజేశారు. ఎస్పీ సూచన మేరకు అనంతపురం టూటౌన్ పోలీసు స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారు. అనంతరం బాధితులు మీడియాతో మాట్లాడారు. ఆదరణ చిట్‌ఫండ్స్, సొసైటీ తదితర పేర్లతో వందల కుటుంబాలను నిర్వాహకులు మోసం చేశారని వాపోయారు. కష్టార్జితంతో రూ.వంద కోట్లు కొల్లగొట్టి స్థిరాస్తులు కూడబెట్టుకుని చివరకు బోర్డు తిప్పేసిన మోసగాళ్లపై కఠిన చర్యలు తీసుకుని, తమ డబ్బు ఇప్పించాలని ఎస్పీని కోరినట్లు వివరించారు.

ప్రతి ఫిర్యాదుపై కేసు నమోదు..

ఒకేసారి పెద్ద ఎత్తున కదలిసేందుకు వచ్చిన ఆదరణ బాధితుల పట్ల ఎస్పీ అన్బురాజన్ సానుకూలంగా స్పందించారు. బాధితుల ప్రతి ఫిర్యాదునూ స్వీకరించి కేసు నమోదు చేయాలని సీఐ శివరాముడిని ఆదేశించారు. దీంతో టూటౌన్ పోలీసు స్టేషన్‌లో ముగ్గురు రైటర్లను ఏర్పాటు చేశారు. బాధితులు ఎక్కువ మంది పెద్ద మొత్తంలో చిట్స్, ఎఫ్‌డీలు చేసిన వారు కావడంతో ఎన్ని కోట్ల రూపాయలు మోసపోయారన్నది ఇంకా తెలియరాలేదు. పోలీసులు కేసుల నమోదు అనంతరం ఎస్‌బీ ఖాతాల్లో ఎంత, చిట్స్ రూపంలో ఎంత నగదు అందాల్సి ఉంది, ఫిక్స్‌డ్ డిపాజిట్లు కింద ఎంత ఉంది తేలనుంది.

గ్రానైట్ లారీ పట్టివేత



మడకశిర: పట్టణ సమీపంలో శనివారం విజిలెన్స్ అధికారులు గ్రానైట్ లారీని అదుపులోకి తీసుకున్నారు. మడకశిర ప్రాంతంలోని క్వారీల నుంచి గ్రానైట్‌ను అక్రమంగా తరలిస్తుండగా విజిలెన్స్ అధికారులు అదుపులోకి తీసుకుని మడకశిర పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

జిల్లా రగ్బీ జట్ల ఎంపిక



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

హిందూపురం టౌన్: కర్నూలు వేదికగా అక్టోబర్ 1, 2 తేదీల్లో జరిగే రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీల్లో పాల్గొనే జిల్లా అండర్ 18 బాలబాలికల జట్ల ఎంపిక ప్రక్రియ శనివారం హిందూపురంలోని పోలీస్ మైదానంలో చేపట్టారు. విశ్రాంత పీడీ ముస్తఫా కమల్ బాషా, పీఈటీ రూప, పీడీలు లక్ష్మి, సందీప్, ఉదయ్‌కుమార్ పర్యవేక్షించారు. అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ప్రవీణ్‌రెడ్డి, యాసిన్ మాలిక్, రెఫరీ విష్ణువర్ధన్, మాజీ అధ్యక్షుడు ఈశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఎంపికైన బాలికల జట్టులో లోహిత, జయశ్రీ, సాయి హనీషా, అర్చన, వీణ, ప్రియమణి, అర్పిక, రైచల్, చందన, గాయత్రి, చంద్రిక, గౌతమి ఉన్నారు. అలాగే బాలుర జట్టులో విజయ్, మారుతి, మనోజ్, హర్షవర్ధన్, వర్షిత్, రాఘవేంద్ర, సూర్యనారాయణ, నందీష్, అభినయ్, సాయి కుమార్ నాయక్, సుందర్‌బాబు, ఎస్.అశోక్, హెచ్.అశోక్, మహేష్ చోటు దక్కించుకున్నారు.

ఏపీఎల్ మిక్స్‌డ్ జండర్ క్రికెట్ టోర్నీ ప్రారంభం



టోర్నీని ప్రారంభిస్తున్న దృశ్యం

అనంతపురం: అనంతపురం జిల్లా క్రికెట్ అసోసియేషన్, ఆర్డీటీ సంయుక్త ఆధ్వర్యంలో తొలిసారిగా శనివారం నుంచి ఏపీఎల్ క్రికెట్ మిక్స్‌డ్ జండర్ టోర్నీ ప్రారంభమైంది. అనంతపురం స్పోర్ట్స్ విలేజ్, గుత్తి, కళ్యాణదుర్గం, ధర్మవరం కేంద్రాల్లో మొత్తం 15 జట్లు పాల్గొన్నాయి. ప్రతి జట్టులోనూ ఐదుగురు అమ్మాయిలు, ఆరుగురు అబ్బాయిలు ఉంటారు. బ్యాటింగ్ భాగస్వామ్యంలో ఓ అమ్మాయి, అబ్బాయి ఉంటారు. అమ్మాయిలు 10 ఓవర్లు, అబ్బాయిలు 10 ఓవర్లు విధిగా బౌలింగ్ చేస్తారు. తొలి రోజు రాప్తాడు, గుత్తి, తాడిపత్రి, నార్పల, గుట్లూరు, ధర్మవరం, కదిరి జట్లు విజయం సాధించాయి.

'వందే భారత్' రాకకు ఏర్పాట్లు



వందేభారత్ రైలు ఇదే



రైలులో అధునాతన సౌకర్యాలతో కూడిన టాయిలెట్

- భాగ్యనగరి నుంచి ఉద్యాననగరి వరకు నేటి నుంచి 'వందేభారత్'
- కర్నూలు, అనంతపురం, హిందూపురం మీదుగా రాకపోకలు
- ఒకేసారి తొమ్మిది రైళ్లను వర్చువల్ విధానంలో లాంఛనంగా ప్రారంభించనున్న ప్రధాని మోదీ
- 'అనంతపురం స్టేషన్‌లో భారీగా స్వాగత ఏర్పాట్లు చేసిన రైల్వే అధికారులు

అనంతపురం సిటీ: ఎన్నో ప్రత్యేకతలు.. మరెన్నో విశిష్టతలు కలిగిన 'వందే భారత్' రైలు ఆదివారం నుంచి పట్టాలపై మెరుపు వేగంతో దూసుకుపోనుంది. పూర్తి దేశీయ పరిజ్ఞానంతో రూపొందించిన వందేభారత్ రైళ్లను కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే అనేక ప్రధాన మార్గాల్లో ప్రవేశపెట్టింది. తాజాగా ఆదివారం ఒక్క రోజే దేశ వ్యాప్తంగా తొమ్మిది మార్గాల్లో వందేభారత్ రైళ్లను ప్రధానమంత్రి నరేంద్రమోదీ వర్చువల్ విధానంలో న్యూఢిల్లీ నుంచి లాంఛనంగా ప్రారంభించనున్నారు. ఇందులో భాగ్యనగరి నుంచి ఉద్యాననగరి మధ్య సంచరించే వందేభారత్ కూడా ఉంది. దీంతో ఇన్నాళ్లుగా ఎంతో ఆశతో ఎదురు చూస్తున్న ఈ ప్రాంత ప్రజల కల సాకారం కానుంది.

సాయంత్రం 6.00–6.30 గంటలకు అనంతకు రాక..

ఆదివారం ఉదయం 11.30–12.00 గంటల మధ్య ప్రధానమంత్రి మోదీ వర్చువల్ విధానంలో వందే భారత్ రైళ్లను ప్రారంభించిన అనంతరం కాచిగూడ నుంచి బయలుదేరే ఈ రైలు మహబూబ్‌నగర్, కర్నూలు మీదుగా అనంతపురానికి సాయంత్రం 6 నుంచి 6.30 గంటల మధ్య రానుంది. ఇందుకు సంబంధించి స్థానిక రైల్వే స్టేషన్ మేనేజర్ అశోక్‌కుమార్, జీఆర్పీ ఎస్‌ఐ విజయ కుమార్, ఆర్పీఎఫ్ పోలీసులు ఏర్పాట్లు చేశారు. మంత్రి ఉషశ్రీ చరణ్, ఎంపీలు రంగయ్య, గోరంట్ల మాధవ్, ఎమ్మెల్యే వెంకట్రామిరెడ్డి, ఎమ్మెల్సీలు, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, మేయర్ మహమ్మద్ వసీం సలీం, కలెక్టర్ గౌతమి, జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్‌తో పాటు బీజేపీ ముఖ్యులను రైల్వే అధికారులు ఆహ్వానించారు. ప్రధాని మోదీ వర్చువల్ విధానంలో రైళ్లను ప్రారంభించే సన్నివేశాలను వీక్షించేందుకు వీలుగా రైల్వే స్టేషన్‌లో పెద్ద స్క్రీన్ ఏర్పాటు చేశారు. అనంతపురంలో వందేభారత రైలుకు ఘన స్వాగతం పలికేలా ఏర్పాట్లు చేశారు.

రేపటి నుంచి రెగ్యులర్‌గా రాకపోకలు..

వందేభారత్ రైళ్లను ఆదివారం నుంచి ప్రధాని ప్రారంభించినా సోమవారం నుంచి అవి రెగ్యులర్‌గా రాకపోకలు సాగిస్తాయి. కాచిగూడ-యశ్వంతపూర్ మధ్య బుధవారం మినహాయించి మిగిలిన రోజుల్లో రెగ్యులర్‌గా ఈ రైలును నడపనున్నారు. కాచిగూడ-యశ్వంత్‌పూర్ మధ్య 610 కిలోమీటర్ల దూరం కాగా 8.30 గంటల్లో గమ్యస్థానం చేరుకుంటుంది. సరాసరి 71.72 కిలోమీటర్ల వేగంతో ఈ రైలు పరుగులు తీయనుంది. కాచిగూడలో తెల్లవారుజామున 5.30 గంటలకు బయలుదేరి యశ్వంత్‌పూర్‌కు మధ్యాహ్నం 2 గంటలకు చేరుకుంటుంది. తిరిగి అక్కడ మధ్యాహ్నం 2.45కు బయలుదేరి కాచిగూడకు రాత్రి 11.10 గంటలకు చేరుకుంటుంది. మార్గమధ్యంలో అనంతపురంలో నిమిషం మాత్రం ఆగుతుంది. తిరుగు ప్రయాణంలో సాయంత్రం 5.40కు వచ్చి 5.41కి బయలుదేరుతుంది.

చార్జీలు ఇలా..

వందేభారత్ రైలులో చార్జీలను కామన్ కోచ్, ఎగ్జిక్యూటివ్ కోచ్ అని రెండు రకాలుగా విభజించి వసూలు చేస్తారు. బేసిక్ చార్జ్‌తో పాటు మరో ఐదు రకాల చార్జీలు కలుపుకుని ధర నిర్ణయించారు.

ఎక్కడి నుంచి ఎక్కడికి ఎంత చార్జ్ వసూలు చేస్తారనేది ఇలా..

	కామన్ కోచ్ చార్జీ	ఎగ్జిక్యూటివ్ చార్జీ
కాచిగూడ-మహబూబ్ నగర్	రూ.470	రూ.900
కాచిగూడ-కర్నూలు	రూ.795	రూ.1480
కాచిగూడ-అనంతపురం	రూ.1,060	రూ.2,010
కాచిగూడ-ధర్మవరం	రూ.1,105	రూ.2,110
కాచిగూడ-యశ్వంతపూర్	రూ.1,600	రూ.2,915
మహబూబ్‌నగర్-కర్నూలు	రూ.610	రూ.1,110
మహబూబ్‌నగర్-అనంతపురం	రూ.890	రూ.1,670
మహబూబ్‌నగర్-ధర్మవరం	రూ.935	రూ.1,760
మహబూబ్‌నగర్-యశ్వంత్‌పూర్	రూ.1,465	రూ.2,645
కర్నూలు-అనంతపురం	రూ.670	రూ.1,235
కర్నూలు-ధర్మవరం	రూ.725	రూ.1,335
కర్నూలు-యశ్వంత్‌పూర్	రూ.1,230	రూ.2,160
అనంతపురం-ధర్మవరం	రూ.380	రూ.705
అనంతపురం-యశ్వంత్‌పూర్	రూ.840	రూ.1,460
ధర్మవరం-యశ్వంత్‌పూర్	రూ.780	రూ.1,335

ఏసీఏ క్రికెట్ టోర్నీకి ముగ్గురి ఎంపిక

అనంతపురం: ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్వాడ్రాగ్యులర్ సిరీస్‌కు అనంతపురం జిల్లాకు చెందిన ముగ్గురు క్రికెటర్లు ఎంపికయ్యారు. ఎంపికైన వారిలో సోయబ్‌ఖాన్, డీబీ ప్రశాంత్‌కుమార్, వినయ్ కుమార్ ఉన్నారు. ట్రైనర్‌గా బొమ్మన్న వ్యవహరించనున్నారు. ఈ నెల 24 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకూ విశాఖపట్నం వేదికగా ఈ టోర్నీ జరగనుంది.

అందుబాటులో పప్పుశనగ, పెసర విత్తనాలు

బుక్కరాయసముద్రం: మండలంలోని రెడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రంలో పప్పుశెనగ, పెసర విత్తనాలను రైతులకు విక్రయిస్తున్నారు. ఈ మేరకు ఆ కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ మల్లేశ్వరి శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. డబ్ల్యూజీజీ 42 రకం పెసర విత్తనం కిలో రూ.130, ఎన్‌బీసీబీ 452 రకం పప్పుశెనగ విత్తనం కిలో రూ.100కు విక్రయిస్తున్నారు.